
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025 | 5

నే ఆటోవాన్ని.. ఆటోవాన్ని..



నే ఆటోవాన్ని.. ఆటోవాన్ని అన్నగారి రూటువాన్ని.. అంటూ నాయకులు శనివారం ఆటోవాలాలుగా మారిపోయారు.. ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం పథకం ప్రారంభోత్స వంలో భాగంగా డ్రైవర్లుగా కనిపించారు..మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఖాకీ చొక్కా ధరించి ఆయా నియోజకవర్గాల్లో ఆర్థిక సాయం అందించారు.







'ఆటో' జోష్!

» ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం
» ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 వేలు
» 11,915 మందికి రూ.17.87 కోట్లు జమ
» కంబాలచెరువు నుంచి ఆటో నడిపిన మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్ప ఆలోచనతో ఆటో, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడం చారిత్రాత్మక నిర్ణయమని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కంబాలచెరువు పార్కు వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అక్కడి నుంచి స్వయంగా ఆటో నడుపుతూ ఆనం కళాకేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మేనిఫెస్టోలో లేకపోయినా సాయం అందించామన్నారు. గత ప్రభుత్వంలో అనేక ఆంక్షలు పెట్టి 2.61 లక్షల మందికి మాత్రమే రూ.10 వేలు చొప్పున రూ.260 కోట్లు ఖర్చు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు ఒక చేత్తో రూ.10 వేలు ఇస్తూ మరో చేత్తో పన్నులు పేరిట ముక్కుపిండి వసూలు చేసిన పరిస్థితి ఉందన్నారు. రోడ్లన్నీ గుంతలమయం కారణంగా ఆటోల మరమ్మతులకే ఏడాదికి రూ.20 వేల వరకూ ఖర్చయ్యేదన్నారు. ఆటోలపై వివిధ రూపాల్లో జరిమానా వేయడం, గ్రీన్‌టాక్స్ రూ.20 వేలకు పెంచి ఆటోడ్రైవర్లపై గుదిబండ వేశారన్నారు. మద్యం బలహీనతలను ఆసరాగా చేసుకుని నాసిరకమైన మద్యాన్ని అధిక ధరలకు విక్రయించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటోలపై ఎక్కడా ఫైన్లు వేయడంలేదని, గ్రీన్స్ ట్యాక్స్ రూ.3 వేలకు తగ్గించామన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కూడా అభివృద్ధి అని భావించి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11,915 మంది డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.17.87 కోట్లు సాయం అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు అమరావతిలో పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం చెక్కును మంత్రి ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ,కూటమి నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు
చిత్రంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, యర్రా వేణుగోపాలరాయుడు తదితరులు

బాణసంచా కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి
ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్పీ నరసింహ కిశోర్ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తయారీ, నిల్వ, అమ్మకాల కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దేశిత దూరంలో ఉండాలన్నారు. ఒకవేళ అగ్నిప్రమాదం సంభవిస్తే స్పందించాల్సిన తీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు, ఇసుక, నీళ్ల వంటివి అందుబాటులో ఉండాలన్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదన్నారు. ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

నిద్రమత్తు.. డాబా పైనుంచి పడి యువకుడి మృతి

కొవ్వూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : డాబా పైనుంచి ప్రమాదవశాత్తూ పడి యువకుడు మృతి చెందాడని కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన రాజులపాటి నాగబాబు(32) సోదరుడు ఇటీవల మరణించాడు. దీంతో ఆ ఇల్లు ఖాళీ చేసి వేరేచోట నివాసం ఉంటున్నారు. నాగబాబుకు అన్నయ్య అంటే చాలా ఇష్టం. దీంతో అన్నయ్య గుర్తుకు వచ్చినప్పుడు వచ్చి ఇంటి డాబాపైన నిద్రిస్తుంటాడు. అదే విధంగా ఈ నెల 3న డాబాపై నిద్రిస్తూ మధ్యలో లేచి కిందికి వస్తుండగా నిద్ర మత్తులో కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.



పిల్లలు ఒక్కసారి దగ్గినా, కొద్దిగా ముక్కు కారినా వెంటనే మందు వేసేయాల్సిందే. నెలా, రెండు నెలల వయసైనా ఇదే పద్ధతి. ఇది చాలా ప్రమాదమని వైద్యులు చెప్పినా వినిపించుకోని వాళ్లు చాలామంది ఉన్నారు. పసివాళ్లకు కాస్త నలత చేసిందంటే ఇంట్లో కలత మొదలవుతుంది. వాళ్లు నోరు తెరిచి చెప్పలేరు. పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్లు ఎలా వస్తాయో అలానే తగ్గిపోతాయని వైద్య నిపుణులు చెప్పే సత్యం. కానీ శరీరం సర్దుబాటు చేసుకునే సమయం ఇవ్వడమే ఇక్కడ కీలకాంశం. వాస్తవానికి కాఫ్ సిరప్‌లు పనిచేయడానికే నాలుగు రోజుల సమయం పడుతుందట. వాటికంటే ఆవిరి పడితే చాలావరకూ వేగంగా కోలుకుంటారని పిల్లల వైద్యులు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని చిన్నారుల మరణం ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తోంది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడొద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- (రాజమహేంద్రవరం/గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)



చిన్నారులకు.. మందులు..వద్దు!
నలత చేసినా.. కలత పడొద్దు..

వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా రోగాలు వస్తుండడం సర్వసాధారణం. ఐదేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. వైరల్ ఇన్ఫెక్షన్లు కావడంతో మందులతో పెద్దగా ఫలితం ఉండదు. కానీ కొందరు డాక్టర్లు ఏవేవో కాంబినేషన్లతో కూడిన మందులు రాసేస్తారు. చాలామంది మందుల షాపు నుంచి కొనుక్కొని వాడేస్తుంటారు. ఇటీవలకాలంలో చిన్నారుల్లో మందుల వినియోగం గణనీయంగా పెరిగింది. మూడేళ్ల కిందటితో పోల్చుకుంటే చిన్నారుల మందుల విక్రయాలు దాదాపు 75 శాతం పెరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇది ప్రమాదకర స్థితిని సూచిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవల పెద్దలు తాగే దగ్గు సిరప్‌ను చిన్నారులకు పట్టగా 11 మంది చనిపోయారు. జైపూర్‌కు చెందిన కేసన్స్ అనే సంస్థ తయారుచేసిన సిరప్ వల్ల ఈ మరణాలు సంభవించినట్టు గుర్తించారు. ఈ సిరప్‌లు నాణ్యతా లోపంతో ఉండడంతోపాటు చిన్నారులకు, పెద్దలకు ఒకే విధమైన సిరప్‌లను మార్కెట్‌లో ఉంచడంతో ప్రాణాపాయం ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు వైద్య- ఆరోగ్య శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అప్రమత్తమయ్యాయి.

దగ్గు వస్తే ఇలా చేసి చూడండి..

రెండేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో జలుబు, దగ్గు వచ్చినా మందులు ఇవ్వడం కానీ, సూచించడం కానీ చేయవద్దని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఎలాంటి మందులు వాడకుండానే దగ్గు తగ్గిపోయే అవకాశాలే అధికంగా ఉంటాయని కేంద్రం తెలిపింది. పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం వంటివి సోకితే తగిన విశ్రాంతి ఇవ్వాలి. శరీరంలో సహజంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి ఇన్ఫెక్షన్‌పై దండెత్తి తరిమి కొట్టే సమయం ఇవ్వాలి. గోరు వెచ్చని ద్రవాలను వైద్యుడి సలహాతో పట్టించవచ్చు. 12 నెలల కంటే ఎక్కువ వయసు పిల్లలకు నిద్ర సమయానికి ఓ అర గంట ముందు కొద్దిగా తేనె కలిపిన గోరువెచ్చని నీళ్ల పట్టించడం వల్ల దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. మూడు రోజులు చూసిన తరువాత చిన్నారుల్లో వచ్చే దగ్గు, రొంప తదితర వ్యాధులకు వైద్యులను సంప్రదించాలి. వెంటనే అవసరం ఉండదు.

» మితిమీరిన మందులు హానికరమే
» దగ్గు, జలుబు సిరప్‌ల వల్ల నష్టాలు ఎక్కువే
» రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి
» పిల్లలకు మందులు వద్దని కేంద్రం ఆదేశం
» పెద్దల మందులు వాడేసినా ప్రమాదమే



ఇలా వాడొద్దు..

చిన్నారుల్లో జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, వాంతులు ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి నెలా చిన్నారులను వైద్యులు వద్దకు తీసుకెళితే వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మందులు మార్పు చేస్తారు. అలా చేయకుండా ఒకే రకమైన మందులను రెండు, మూడేళ్ల వరకు వినియోగిస్తున్నారు. డ్రాప్స్ స్థానంలో పిడియాట్రిక్ సిరప్‌లు, అవి అందుబాటులో లేకుంటే పెద్దల సిరప్‌లు వినియోగించే వారు అధికం.లేకుంటే మెడికల్ షాపులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి వారు సూచించిన మందులను వాడేస్తున్నారు. ఇప్పుడు ఇదే ప్రమాదకరంగా మారింది. దగ్గు, రొంప, జ్వరం వచ్చినప్పుడు ఆరేళ్లలోపు చిన్నారులకు పెద్దల మందులను డోస్ తగ్గించి వాడితే సరిపోతుందనే భావన సరికాదు. చిన్నారులు, పెద్దలు ఎవరైనా సరే వైద్యులు సూచించిన మోతాదులోనే మందులను వినియోగించాలి.

ఈ మందులు వాడితే ప్రమాదమే..

జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు డీకంజెస్టెంట్లు, యాంటీ హిస్టామైన్, డెక్స్ట్రామెథార్‌ఫన్ కాంబినేషన్ల మందులను డాక్టర్లు సిఫారసు చేస్తుంటారు. వాటివల్ల దారుణమైన ప్రతికూలతలు ఉన్నాయి. అవి నేరుగా మెదడుపై ప్రభావం చూపడంతో పిల్లలు మూర్ఛకు గురవుతారు. మగతగా ఉంటారు. గుండె కొట్టుకొనే వేగం పెరిగి మరణానికి దారి తీస్తుంది. మల విసర్జితానికి ఇబ్బంది కలుగుతుంది. పిల్లలు చిరాకు, ఆందోళనగా ఉండి నీరసించి పోతారు. డెక్స్ట్రామెథార్‌ఫన్, గ్వైఫెనిసిన్ వల్ల ఎక్కువగా అలా జరుగుతుంది. కానీ మనం రోగం పెరుగుతున్నా తగ్గుతోందని అనుకొని ఆ మందులనే బలవంతంగా పట్టించేస్తాం.

సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం..



చిన్నారులతోపాటు పెద్దల్లో సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం. ఒకసారి డాక్టరు సూచించిన మందులను నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత తరచూ వాడడం వల్ల దుష్ప్రభావం చూపే అవకాశాలు అధికం. వైద్యులు ఏదైనా మందును సూచించినప్పుడు మోతాదు ప్రకారం వాడాలి. చిన్నారుల సిరప్‌లు, డ్రాప్స్‌ను తెరిచిన తర్వాత 21 రోజుల్లోగా వాడాలి. ఆ తర్వాత వాడితే ఇబ్బందికరమే. వైద్యుల సలహా లేకుండా మందులు వాడడం వల్ల చిన్నారుల్లో మెటబాలిజం దెబ్బతినే ప్రమాదముంది. చిన్నారులకు ఏ ఇబ్బంది ఉన్నా వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విజయశేఖర్, చంటి పిల్లల వైద్య నిపుణుడు, ప్రభుత్వాసుపత్రి కాకినాడ

మూడు రోజులు చూడాలి



దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లు వస్తే తక్షణమే మందులు అవసరం లేదు. కాచి చల్లార్చి గోరు వెచ్చగా తేనె నీళ్లు (ఏడాది దాటాక), తేనె లవంగం నీళ్లు, ఆవిరి పట్టడం వంటివి చేయవచ్చు. మూడ్రోజుల తర్వాత కూడా దగ్గు వస్తుంటే డాక్టరును సంప్రదించాలి. అవసరం అనుకుంటే వారి పర్యవేక్షణలోనే తగు మోతాదులో మందులు వాడాలి. డెక్స్ట్రామెథార్‌ఫన్ నాలుగేళ్లలోపు పిల్లలకు వాడకూడదు. మందుల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం.

- కొండా ఉమా శివరామకృష్ణ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, రాజమండ్రి

తోటలను పీల్చి పిప్పి చేస్తున్నాయ్!

నల్లజర్ల/ కోరుకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆఫ్రికా నత్తలు నరకం చూపిస్తున్నాయి.. రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి..ఎక్కడ నుంచి ఎలా వచ్చాయో తెలియదు కానీ రైతులను పట్టిపీడిస్తున్నాయి.. ఎక్కడికక్కడ నత్తలు విజృంభించి పంటలు,తోటలను పీల్చి పిప్పి చేస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా రైతులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నల్లజర్ల మండలం ఆవపాడు, శింగరాజుపాలెం, ముసుళ్ళకుంట, పుల్లలపాడు, కోరుకొండ మండలం దోసకాయలపల్లి తదితర గ్రామాల్లో నత్తల విజృంభణ అధికంగా ఉంది. నిమ్మ,ఆయిల్ పాం, కొబ్బరి, కోకో, కూరగాయల పంటలకు నత్తలు వందల సంఖ్యలో పట్టి రసం పీల్చేస్తున్నాయి. ఎన్ని పురుగుమందులు పిచికారీ చేసిన ఫలితం లేకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వ్యవసాయాధికారులు,ఉద్యాన అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. కూలీల సహాయంతో తొలగిస్తున్నా మరుసటి రోజు మళ్లీ అదే సంఖ్యలో నత్తలు చేరి సర్వనాశనం చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. నత్తల దెబ్బకు నిమ్మ, జామ తదితర చెట్లు ఎండిపోతున్నాయి. చివరి దశకు వచ్చిన చేలు కళ్లెదుటే పీల్చిపిప్పిచేస్తుంటే తట్టుకోలేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

» పంటలపై ఆఫ్రికా నత్తల దాడి
» పల్లెలకు పాకుతున్న వైనం
» నాశనమైపోతున్న తోటలు
» నష్టపోతున్న రైతాంగం
» పనిచేయని పురుగుమందులు
» కన్నెత్తి చూడని అధికారులు
» రైతులకు కొత్త తలనొప్పి

నత్తల నివారణ ఇలా..

- ఈ నత్తలు మామూలుగా తోటలో కనిపించేవి కాదు.. ఆఫ్రికా దేశం నుంచి వలస వచ్చిన జాతి. ప్రస్తుతం పంటలను పట్టి పీడిస్తోంది. రైతాంగం దృష్టి పెడితే నివారించవచ్చు.
- ఒక్కొక నత్త 1000 నుంచి 1200 గుడ్లు పెడుతుంది రైతులు సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి.
- తోటలో కనిపించిన నత్తలను చేతులకు గ్లౌజులు వంటివి తొడుక్కుని ఒక్కొకటిగా ఏరి ఒక కేజీ ఉప్పు లీటరు నీటిలో కలుపుకున్న ద్రావణంలో నత్తలను వేస్తే నివారించొచ్చు. మళ్లీ అవి వచ్చే అవకాశం ఉండదు. ఈ చిన్న చిట్కా పాటించాలి.
- ఉధృతి ఎక్కువ ఉంటే 1లీ నీటికి 3గ్రాముల చిలెటెడ్ కాపర్, 3 గ్రాముల చిలెటెడ్ ఐరన్ కలిపి చెట్ల మీద పిచికారి చేసుకుంటే రాలి చనిపోతాయి.
- ఒకతోట నుండి వేరొక తోటకి వ్యాప్తి చెందకుండా సరిహద్దులో అక్కడక్కడా ఉప్పునీరు చల్లిన గోనె పట్టలను పరిచినా వాటి వ్యాప్తి నివారించవచ్చు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటకు నాశనం తప్పదు. తెలియకుండానే పంటంతా నాశనమైపోతోంది.
- నత్తల నివారణకు ఏ పురుగు మందు పిచికారి చేయకూడదు. చేసినా ఫలితం ఉండదు.



నిమ్మచెట్టును ఆశించిన ఆఫ్రికా నత్తలు



ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా..!

ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలి.. ఈ విషయం తెలియాలంటే గోదావరి జిల్లాలకు రావాల్సిందే మరి.. అది తెలుసుకున్నారు.. ఇదిగో ఇలా తరలివచ్చారు.. ఎక్కడి నుంచో తెలుసా.. బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక నుంచి సుమారు 30 మంది ప్రతినిధులు బృందం వచ్చారు.. శనివారం పెరవలి మండలం ముక్కామల, కొవ్వూరు మండలం కాపవరంలో ప్రకృతి సాగు చేస్తున్న రైతులను పలకరించారు. సాగు విధానం తెలుసుకున్నారు.. రైతులను ప్రశంసించారు. 7

'ఉపాధి' నిర్వీర్యం చేస్తే సహించం 8
తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు

'ఆటో డ్రైవర్ల సేవ'లో ప్రజాప్రతినిధులు..



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ. చిత్రంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం పంపిణీ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నాయకులు

హర్షాతిరేకాలు



కాకినాడలో ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సభలు నిర్వహించి ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేశారు. కూటమి ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా ఇచ్చిందని పలువురు డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. వారి సంతోషం వారి మాటల్లోనే....

ఆటోవాలాలకు ఎంతో మేలు

శెట్టి శ్రీను, వేట్లపాలెం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 శాతం నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు నిత్యం రూ.700 నుంచి రూ.1,000 వచ్చేది. ఇప్పుడు రూ.500-రూ.700 మధ్య మాత్రమే వస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఆటోవాలాలకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పటాన్ బాజీ, లక్ష్మీపురం, దేవరపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా



ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతం ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం మా ఖాతాల్లో రూ.15వేలు జమ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

సీఎం మా కష్టాన్ని గుర్తించారు

ఆర్.గిరీష్ కన్న, పోతవరం, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా



గత ప్రభుత్వంలో ఏడాదికి కేవలం రూ.10వేలు ఇచ్చేవారు. అవి ఆటో ఫిట్‌నెస్‌కి సరిపోయేవి కావు. రూ.5వేలు అప్పు చేయాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు మా కష్టాన్ని గుర్తించి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు.

ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంది

మోకా వెంకటేశ్వరరావు, అయినాపురం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల మాకు కొంత నష్టం కలిగింది. రూ.15వేలతో ఆ నష్టం భర్తీ అవుతుంది. ఆటో కార్మికులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇది ఎంతో ఉపయోగం. సొమ్ము అవసరమైనప్పుడు ప్రైవేటు ఫైనాన్సర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.

ఎంతో ఆనందంగా ఉంది

ములికి సూరిబాబు, తుని ఏరియా ఆటో యూనియన్ ప్రెసిడెంట్



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పకపోయినా, ఆదుకుంటామని ఎటువంటి హామీ ఇవ్వకపోయినా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలా రుణపడి ఉంటాం.

కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

గెద్దం శేఖర్‌బాబు, ములికిపురం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఈ పథకం మాకు ఎంతో తృప్తి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. సూపర్-6 పథకాల్లో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం లేకపోయినప్పటికీ మా ఇబ్బందులను గమనించి రూ.15వేలు కేటాయించడం ఆనందంగా వుంది.

చిన్నచిన్న మరమ్మతులు చేయించుకుంటాను

కోపిల్ల శ్రీను, తీపర్రు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా



రూ.15వేలతో నా ఆటోకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాను. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఉపయోగిస్తాను. ప్రభుత్వం ఈ సాయం చేయకపోతే బయట అప్పు చేసి వాటిని చేయించాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు రుణపడి ఉంటాం.

కూటమి ప్రభుత్వం అండ

పైల వీరబాబు, ఏలేశ్వరం, కాకినాడ జిల్లా



స్త్రీ శక్తి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఆటోపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానిక నాయకులు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషదాయకం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాను, అండను ఎన్నటికీ మరువలేం.

థాంక్యూ... సీఎం సార్

చౌదరి, కాకినాడ పాత బస్టాండ్



ఆటోయే మా కుటుంబానికి జీవనాధారం. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. అప్పట్లో ఇచ్చిన రూ.10వేలు కూడా ఆటోల మరమ్మతులకే సరిపోయేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. రూ.15వేలు సాయం అందించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.

ఒటన్ నొక్కగానే డబ్బులు పడ్డాయి

ఆర్.రాజు, కాకినాడ



సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట మాట నిలబెట్టుకున్నారు. అమరావతిలో బటన్ నొక్కగానే ఇక్కడ వెంటనే నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. చాలా ఆనందించాను.

మా కుటుంబాల్లో వెలుగులు

బూరుగు కల్యాణ్, క్రాపచింతలపూడిపాలెం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఆటో డ్రైవర్ల సేవలో పథకం చాలా బాగుంది. ఎంతో మంది ఆటోవాలాల జీవనోపాధికి ఇది మేలు చేస్తుంది. ఎన్నికల ముందు ఎటువంటి హామీ ఇవ్వకపోయినా మా ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకున్నారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపుతాయి.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

రూ.53.41 లక్షల ఆదాయం



శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామికి అర్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.53.41 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

వాలీబాల్ క్రీడాకారుడు పూజలు

వెంకన్న ఆలయంలో శనివారం తాడిపూడికి చెందిన అంతర్జాతీయ వాలీబాల్ అండ్ బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ముదునూరి చలపతి రామకృష్ణంరాజు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తెలంగాణ రాజధానిలో కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామి చిత్రపటం అందజేశారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



క్రీడాకారుడికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాస్తవికతకు అద్దం పట్టేలా జోగేష్ కవిత్వం

లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటి ఆవిష్కరణ



లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వీయ అనుభూతితో బడుగు భాస్కర జోగేష్ రాసిన కవిత్వంలో సౌందర్య దృష్టికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని.. ప్రాపంచిక, వాస్తవికత పట్ల అంతే ఎరుకతో రచన సాగించారని ప్రముఖ కవి, రచయిత నామాడి శ్రీధర్ పేర్కొన్నారు. కవి, తన బాల్య, యవ్వన కాలాల జ్ఞాపకాలతో పాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను కవిత్వీకరించారని ఆయన ప్రశంసించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం కవి భాస్కరజోగేష్ రచించిన కవితా సంపుటి 'లిథియా పూలు-సలామీ అఖాతం' ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి సభకు అధ్యక్షత వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్ కుమార్ చేతులమీదుగా జోగేష్ మాతృమూర్తి ఈశ్వరమ్మకు తొలి ప్రతిని అందించారు. ప్రధాన వక్త, కవిసాహిత్య విమర్శకులు సుంకర గోపాల్ మాట్లాడుతూ లిథియా పూలు-సలామీ అఖాతం కవిత్వ సంపుటిలో అనుభూతి, భావుకత, సామాజిక పరిణామాల చిత్రీకరణ ఉందన్నారు. ఒక తాత్విక ధార్మిక దృక్పథంతో పాటు గాడత స్పష్టత ఉన్న అరుదైన కవిగా జోగేష్‌ను కొనియాడారు. మరో రచయిత అవధానుల మణిబాబు మాట్లాడుతూ జోగేష్ కవితా సంపుటిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, దాట్ల దేవదానంరాజు, కోదూరి రామరాజు, ఎంఎస్ సూర్యనారాయణ, మిరప మహేష్, మోకా రత్నరాజు తదితరులు ఆత్మీయ వచనాలు చెప్పారు. కవి బడుగ భాస్కరజోగేష్ తన కవితా నేపథ్యాన్ని వివరించారు. మధునాపంతుల చలపతి, ముక్కామల చక్రధర్, చెల్లి రవిగౌరన్, ముత్యాల శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, అడపా ప్రసాద్, నంబూరి మూర్తి, కుడుపూడి అశోక్, వనుము చంద్రశేఖర్, నందెపు శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డులో కారుపర్తికి అవకాశం



కారుపర్తి నాగ మల్లేశ్వరరావు

అంబాజీపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగ మల్లేశ్వరరావుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటించిన ఉత్వర్వులో ఆయన్ని ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించారు. గత 35 ఏళ్లుగా ఆయన సిద్ధాంతిగా ఉన్నారు. పుల్లేటికుర్రులోని ఆలయాన్ని సొంతంగా నిర్మించిన ఏటా వైభవోపేతంగా పూజలు నిర్వహిస్తారు. అలాగే ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబానికి ఆయన వ్యక్తిగత సిద్ధాంతి. అలాగే ఆయన పంచాగాలు రూపొందించి దేశ, విదేశాల్లో ఆవి ష్కరించారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు జరగనున్నాయి.ఏలూరులో ఈనెల 12న 7వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025 జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్ వద్దకు హాజరుకావాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కాకినాడ జిల్లా ఇన్చార్జి ప్రెసిడెంట్ వి.రామస్వామి, సెక్రటరీ సాఖీర్ కోరారు. మరిన్ని వివరాలకు 9390131777, 8121394478లో సంప్రదించాలని కోరారు.

అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం రెజ్లింగ్, స్క్వాష్, మోడరన్ పెంటాతలను విభాగాల్లో బాల, బాలికల ఎంపికలు జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కే.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్ జార్జ్, కె.పట్టాభిరామం వై.బంగారు రాజు, టైక్వాండో జిల్లా కార్యదర్శి అరున్ రావు ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. అదేవిధంగా రాజా ట్యాంక్‌లో ఉన్న స్కేటింగ్ రింగ్‌లో స్కేటింగ్ అండర్ 14, 17 బాల బాలికల ఎంపికలు జరిగాయి.

7న ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న జరుగుతుందని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి నాలుగు జిల్లాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఈ ఏడాది జూలై 2, సెప్టెంబరు 10 తేదీల్లో నిర్వహించిన సమావేశాల యాక్షన్ టేకెన్ రిపోర్టు కూడా తీసుకురావాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు కన్నుమూత



అప్పారావు (ఫైల్)

అమలాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పాత్రికేయునిగా పనిచేసిన అడపా అప్పారావు(78) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అమలాపురంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 'ఆంధ్రజ్యోతి' సహా వివిధ దినపత్రికల్లోను, టీవీ చానళ్లలోను కాకినాడ కేంద్రంగా ఆయన పనిచేశారు. ఐదు దశాబ్దాల పాటు పాత్రికేయరంగానికి అప్పారావు సేవలందించారు. ఆయన మృతికి వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. అమలాపురం మండలం రోళ్లపాలెంలో అప్పారావు భౌతికకాయాన్ని ఉంచారు.

ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

తూర్పుగోదావరి జిల్లా కాపవరం, ముక్కామలలో బ్రెజిల్ ప్రతినిధుల బృందం పర్యటన



కాపవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధులు



ముక్కామలలో డ్రోన్‌తో ప్రకృతి కషాయాల పిచికారి పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొవ్వూరు/పెరవలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను బ్రెజిల్, యుఏఈ, శ్రీలంకకు చెందిన 30 మంది నిపుణుల బృందం సందర్శించారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యాపారవేత్త, నౌసంస్థ సీఈవో వాల్టర్ లింక్, బ్రెజిల్ మంత్రిత్వశాఖకు చెందిన వివియన్, సాండ్రో, 30 మంది ప్రతినిధుల బృందం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు విచ్చేసిన విదేశీ ప్రతినిధుల బృందాన్ని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక బృందం పెరవలి మండలం ముక్కామల, రెండో బృందం కొవ్వూరు మండలం కాపవరం గ్రామాల్లో పర్యటించి రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) వినూత్న నమూనాలను పరిశీలించారు. ముక్కామలలో అన్నపూర్ణా నాన్ పెస్టిసైడల్ మేనేజ్‌మెంటు షాపు వద్ద ప్రకృతి వ్యవసాయ 9సార్వత్రిక సూత్రాల చక్రాన్ని సందర్శించారు. అనంతరం ఘనజీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానం, వినియోగం, నిల్వ చేయడంపై అవగాహన కల్పించారు. జి.వెంకటేశ్వర్లు నిర్వహిస్తున్న డ్రమ్ సీడర్‌తో వరి సాగును వీక్షించారు. కలుపునియంత్రణ, కూలీలఖర్చు తగ్గింపు, సమయపాలన వంటి ప్రయోజనాలను అడిగితెలుసుకున్నారు. పి.రామకృష్ణ నిర్వహిస్తున్న పామ్‌ఆయిల్, వక్క, అరటిసాగు నమూనాలను పరిశీలించి ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండో బృందం కాపవరంలో ప్రకృతి వ్యవసాయం 9సార్వత్రిక సూత్రాల చక్రం, వాటి అమలును పరిశీలించారు. 13 ఎకరాల హార్టీకల్చర్ పాలీక్రాపింగ్ క్షేత్రాన్ని సందర్శించారు. వ్యవసాయ సూత్రాలను అనుసరించడం, సౌరశక్తి వినియోగం ద్వారా చీడపీడల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను ప్రయోగించడం, పంట వైవిధ్యంతో సస్యశ్యామలంగా కనిపిస్తున్న పొలం అడవిని తలపిస్తుందని బృందం సభ్యులు ప్రశంసించారు. సైన్స్ అండ్ అకాడమీ థీమాటిక్ లీడ్ సుధాకర్ నేతృత్వంలో ప్రతినిధులు రైతు శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించడంలో వారి పాత్రను ప్రశంసించారు. ధర్మవరంలో గోపాలకృష్ణ ఎనీ టైం మనీ నమూనా, వీర మణికంట డ్రం సీడర్ వరిసాగును సందర్శించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాదవరావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానఅగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ అందించిన సమాచారం ప్రకారం.. రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక గ్రామానికి చెందిన గుత్తుల విజయరాజు(30) నర్సరీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు ప్రారంభం

అంతర్వేది, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి- నర్సాపురంలో రేవులో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి పంటు రాకపోకలు పునఃప్రారంభించారు. ఇటీవల వరదల కారణంగా గత వారం రోజులుగా పంటు రాకపోకలు నిలుపుదల చేశారు. వరద ఉధృతి తగ్గడంతో ప్రయాణికుల సౌకర్యార్థం పంట్లను శుభ్రపరిచి రాకపోకలను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే సఖినేటిపల్లి రేవు రాకపోకలు నిలిచిపోవడంతో చించినాడ వంతెన మరమ్మతులు జరుగుతుండగా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు, చిన్నకార్లు,బాటసారులకు అనుమతులున్నాయి.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన కాకినాడ పోలీసులు

కాకినాడ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు భారమవ్వకూడదని తనువు చాలించాలనుకుంది ఆ తల్లి. మృత్యువుకు దగ్గరగా వెళ్తున్న పోలీసులు రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. వివరాలోకి వెళితే.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల వాసిరెడ్డి లక్ష్మీతులసికి కుమారుడు సుబ్రహ్మణ్యం, కుమార్తె భవాని ఉన్నారు. ఆమె భర్త కొంతకాలం క్రితం మృతి చెందడంతో పిల్లల వద్దే ఉంటుంది. అయితే ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో కుమారుడు, కుమార్తె కలిసి తల్లిని అప్పుడప్పుడు ఆసుపత్రులకు తిప్పడం, మందులు కొనడం చూసి తనకు తిండి పెట్టడమే కాకుండా, వారిపై అదనపు ఆర్థిక భారం పడుతుందని లక్ష్మీతులసి మనోవేదనకు గురైంది. తాను తనువు చాలిస్తే పిల్లలపై ఆర్థిక భారం లేకుండా ఉంటారని భావించింది. తన కుమారినికి నీకు భారం కాకూడదని.. చనిపోతున్నాను నన్ను క్షమించు అని లేఖ రాసి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం లేఖను గుర్తించిన సుబ్రహ్మణ్యం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ మజ్జి అప్పలనాయుడు బృందంతో కలిసి గాలింపు చేపట్టారు. అయితే ప్రతాప్‌నగర్ సమీపంలోని రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధంగా ఉన్న లక్ష్మీతులసిని రక్షించి ఆమె పిల్లలకు అప్పగించారు. ఆ కుటుంబం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. లక్ష్మీతులసిని రక్షించిన సీఐ బృందాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.



లక్ష్మీతులసిని రక్షించి అప్పగిస్తున్న సీఐ అప్పల నాయుడు

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏరువాక శాస్త్రవేత్తలు నరసింహరావు, శ్రీనివాస్.. కోటికేశవరంలో పంట పరిశీలన



సస్యరక్షణకు మందులు అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత తరుణంలో అడపాదడపా వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలకు సార్వా వరి, మినుము, ప్రత్తి పంటల్లో చీడపీడలు ఎక్కువవుతున్నా యని, రైతులు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహరావు, శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని కోటి కేశవరం వ్యవసాయ సబ్ డివిజన్‌లో పలు గ్రామాలను సందర్శించి, పలు చీడపీడల నివారణకు పలు సూచనలు ఇచ్చారు. నరసింహరావు మాట్లాడుతూ ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో వరిలో ఆకు నల్లి తెగులు ఆశించి, ఆకులు ఎర్రబడుతున్నాయి. నివారణకు డైకాఫోల్ 5.0 మి.లీలో లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయా లి. ఎండాకు తెగులు నివారణకు మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోలు వేయాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే, ప్లాంటో మైసిన్ 1.0గ్రా.+కాపర్ హైడ్రాక్సయిడ్ 2.0 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. గడ్డి దుబ్బు తెగులు లేదా కాండం కుళ్లు తెగులు నివారణకు, టెబ్యూకోనజోల్ 2.0 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయా లన్నారు. కంకి నల్లి నివారణకు డైకో ఫాల్ 5.0 మి.లీ. లీటర్ నీటికి పిచికారీ చేయాలి. ఎలుకల నివారణకు బ్రోమా డియోలోన్ 2శాతం, నూనె, నూకలు కలిపి పొట్లాలుగా కట్టి బొరియల వద్ద అమర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శశిబిందు, ఏవో రఘుకుమార్, పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

మంచి నటులను, దర్శకులను అందించాలి

సినీ దర్శకుడు, గీతా కృష్ణ ఫిల్మ్ స్కూల్ అధినేత గీతా కృష్ణ



అనపర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమకు మంచి నటులను, దర్శకులను అందించా లన్న లక్ష్యంతో హైదబాద్‌లో గీతా ఫిల్డ్ స్కూల్‌ను స్థాపించినట్లు ప్రముఖ దర్శకుడు గీతా కృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం అనపర్తిలోని ప్రెస్‌క్లబ్‌ను సందర్శించిన ఆయన కొద్దిసేపు ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. దర్శకత్వంపై ఉన్న మక్కువతో కళాతపస్వి కె.విశ్వనాథ్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేరి సాగర సంగమం, జననీ జన్మభూమి, స్వాతిముత్యం సినిమాలకు పనిచేశానన్నారు. 1986లో సంకీర్తన చిత్రం ద్వారా దర్శకుడిగా పనిచేసి మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ దర్శకుడు అవార్డు పొందానన్నారు. మొత్తం నాలుగు భాషల్లో పది చిత్రాలకు దర్శకత్వం వహించానన్నారు. అనంతరం గీతా కృష్ణ ఫిల్మ్ స్కూల్‌ను స్థాపించానని ఆన్‌లైన్ ద్వారా కూడా క్లాసులు చెబుతానన్నారు. తన వద్ద శిక్షణ పొందిన పలువురు నటులు, దర్శకులు రాణిస్తున్నారన్నారు. అలాగే వెబ్ సిరీస్‌లు కూడా తీశానన్నారు. కోకిల చిత్రం ద్వారా నాజర్‌ను పరిచయం చేశానని, అలాగే సమంత, తమన్న, గద్దె సిందూర, బిందు మాధవి వంటి వారిని తెలుగు తెరకు పరిచయం చేశానని గీతా కృష్ణ పేర్కొన్నారు.

వైభవంగా గద్దెలో కనకదుర్గమ్మ ఊరేగింపు

గోకవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గోకవరంలోని వీరభద్రుని గద్దెలో కనకదుర్గమ్మ ఊరేగింపు శనివారం వైభవంగా జరిగింది. ముందుగా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కంచర్ల నరసింహమూర్తి, రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఊరేగింపు ప్రారంభించారు.అమ్మవారిని రథంపై ప్రధాన రహదారిపై ఊరేగిస్తూ గరగలు, కోలాటం, నవదుర్గ నృత్యాలు, తీన్మార్ డప్పులు, డీజే డాన్స్‌లతో హోరెత్తించారు. గద్దె నుంచి స్థానిక పంచాయతీ కార్యాలయం వరకు ఊరేగింపు కొనసాగింది. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బూరుగుపూడిలో సాయి సత్యవ్రతాలు



కోరుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి ద్వారకా షిర్డి సాయిబాబా ఆలయంలో శనివారం సాయి సత్య వ్రతాలు జరిగాయి. బాబా 107వ దివ్య సమాధి ఉత్సవాలను ఆలయ గురుదేవులు మామిడిపల్లి రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ఈ వ్రతాల్లో గురుదేవులు ఆదిపూడి మోహన్‌రావు కుమారుడు కృష్ణసాయి ఆధ్వర్యంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాసాయిబాబాకు పంచ హారతులు, పాలాభిషేకం చాలీసా పారాయణం,అఖండ నామ జప జయ్ఞం జరిగాయి.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, విజయభారతి, మూసిర రామకృష్ణ, వెంకటలక్ష్మి, కంటే గణపతి, కొప్పాక వెంకటేశ్వర రావు, గూడపాటి వెంకటేశ్వరరావు, సాయిబాబా సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పీడీ యువరాజారెడ్డికి సత్కారం



పందలపాకలో యువరాజారెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బిక్కవోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న పీడీ యువరాజారెడ్డి జిల్లా ఉత్తమ పీడీ అవార్డు తీసుకున్న సందర్భంగా శనివారం ఆయనకు పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పీడీ సేవలను పలువురు కొనియాడారు. అనంతరం పీడీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, గొలుగూరి తాతారెడ్డి,కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నాయకులు గుణ్ణం శ్రీనివాసచౌదరి,హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు..

రాజమండ్రి బాలుడు భువనగిరి చైల్డ్‌కేర్ సెంటర్‌లో.. తల్లి ఒడికి చేర్చిన సీడబ్ల్యూసీ పోలీసులు



భువనగిరిలో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యులు

భువనగిరి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన రాజమండ్రి బాలుడి కథ భువనగిరిలో సుఖాంతమైంది.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.రాజమహేంద్రవరం సమీపంలోని గోకవరం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక దంపతుల తొమ్మిదేళ్ల కుమారుడు పాత దుస్తులు, చీపుళ్లు తదితర వస్తువులు విక్రయించే అమ్మమ్మ వెంట నెలరోజుల క్రితం సికింద్రాబాద్‌కు వచ్చాడు.ఈ క్రమంలో అమ్మమ్మ నుంచి తప్పిపోయిన మనుమడు అక్కడే వీధుల వెంట తిరిగాడు. సికింద్రాబాద్ స్టేషన్‌లో సెప్టెంబరు 30న రైలెక్కి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. ప్లాట్‌ఫామ్‌పై వెళుతున్న బాలుడిని చూసిన స్థానిక పోలీసులు చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో చైల్డ్‌లైన్ సభ్యులు స్పందించి బాలుడిని భువనగిరిలోని బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) బెంచ్ ఎదుట ప్రవేశపెట్టి స్థానిక చైల్డ్‌కేర్ సెంటర్‌లో నివాసం కల్పించింది. బాలుడు తెలిపిన వివరాల ప్రకారం తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు అధికారులు సమాచారం ఇచ్చారు. తండ్రి తాపీ పని చేస్తుండగా జరిగిన ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో ఉండగా, తల్లి బంధువులతో కలిసి శనివారం భువనగిరికి వచ్చింది. సాక్ష్యాధారాలు, దర్యాప్తు వివరాల ఆధారంగా సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ సమక్షంలో బాలుడిని తల్లికి అప్పగించారు. సకాలంలో స్పందించి చేరదీసిన ఆలేరు పోలీసులకు, సీడబ్ల్యూసీకి బాలుడి కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎర్ర శివరాజు, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు. అయితే అమ్మమ్మ జాడ తెలియ రాలేదని కుటుంబసభ్యులు తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు: సీఐ



బలభద్రపురంలోని బాణసంచా తయారీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సుమంత్

బిక్కవోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బాణాసంచా తయారీదారులు నిబంధనలు పాటించపోతే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ హెచ్చరించారు. శనివారం ఆయన బలభద్రపురంలోని శ్రీజానకిరామా గ్రాండ్ ఫైర్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులను పరిశీలించారు. బాణసంచా ముడి సరుకు నిల్వలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేవో తనిఖీ చేశారు. నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. సీఐ వెంట ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఉన్నారు.

ఆటోడ్రైవర్ల సేవలో

కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ఆటోడ్రైవర్ల సేవలో.. పథకం
- ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం రూ.15 వేలు జమ



రాజమహేంద్రవరంలో ఆటోడ్రైవర్లకు నమూనా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల జీవితాలను మెరుగుపరిచే విధంగా ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో.. పథకంలో భాగంగా ప్రభుత్వం ఆటోడ్రైవర్ల ఖాతాలకు శనివారం రూ.15 వేలు చొప్పున జమచేసింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆటోడ్రైవర్లకు ఆయన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 2011 మందికి, కడియం మండలంలో 479 మందికి, అర్బన్‌లో 8 వార్డుల్లో 510 మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. నియోజకవర్గంలో ఆటో డ్రైవర్లకు రూ.4.50 లక్షల ఆర్థికసాయం వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేరుగా ఆటో డ్రైవర్ల ఖాతాల్లో సొమ్ములు జమచేయడం కూటమి ప్రభుత్వ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమన్నారు. ఆటో డ్రైవర్లను వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా రోడ్డు భద్రత, వాహన రిజిస్ట్రేషన్, పన్ను సడలింపులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మార్ని వాసుదేవరావు, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మత్యేటి ప్రసాద్, మజ్జి పద్మ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సరళవందనం, ఎంపీడీవోలు కేఏస్ అర్మ్‌స్ట్రాంగ్, కె.రమేష్ పాల్గొన్నారు.

కడియం: కడియం దేవీచౌక్ సెంటర్‌లో కూటమి నాయకులు, ఆటోడ్రైవర్లతో కలిసి సంబరాలు జరిపారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, వరగోగుల వెంకటేశ్వరరావు, చిలుకూరి ప్రభ, తామెళ్ల అయ్యప్ప, పొన్నగంటి శంకర్, ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కోరుకొండలో నమూనా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, చైర్మన్ బీవీఆర్

కూటమి అండ: బత్తుల

కోరుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కోరుకొండ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఈ పథకాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బత్తుల అధ్యక్షత వహించి మాట్లాడారు.కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు కల్పించడంతో నష్టపోయామంటున్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకునేందుకు ఆటో డ్రైవర్ సేవలో పేరిట ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1862 మంది ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు రూ.2,79,30,000 అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానిక దేవుడు కోనేరు వద్ద నుంచి కోరుకొండ సెంటర్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు జరిగిన భారీ ఆటో ర్యాలీని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే బత్తుల ఆటో నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణనాయక్, మూడు మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం: నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా నియోజకవర్గ పరిధిలోని ఆటో డ్రైవర్లు చేపట్టిన కృతజ్ఞత ర్యాలీని కెనాల్ రోడ్డులో కోర్టు వద్ద ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి ఆటోలు నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ స్థానిక బాలుర హైస్కూల్ క్రీడా మైదానానికి చేరుకుంది. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాధిక అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇవ్వకపోయినా డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రతి డ్రైవరుకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఎంవీఐ రాధిక మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, డ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 1105 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రూ.1.11 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నియోజవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, రావాడ నాగు, వెలుగుబంటి సత్తిబాబు, బేరా వేణమ్మ, త్రిమూర్తులు, కర్రి శేషారత్నం, గొల్లు హేమతులసి, నాలుగు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- అనపర్తిలో సామాజిక తనిఖీ వేదిక
- రూ.2.23 లక్షల నిధుల దుర్వినియోగం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కొంత మంది సిబ్బంది ప్రవర్తిస్తున్నారని, అటువంటి వారిని సహించబోమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన ఆడిట్ వివరాలను అధికారులు గ్రామాల వారీగా వివరించారు. మండల పరిధిలో రూ.2.23 లక్షల నిధులు దుర్వినియోగమైనట్టు అధికారులు గుర్తించారు. అత్యధికం పెదపర్తి పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్ బోడా ప్రతాప్ రూ.1.28 లక్షలు, మహేంద్రవాడ పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్ సత్తి సృజన రూ.51,860 దుర్వినియోగం చేసినట్టు పేర్కొన్నారు. వీరి నుంచి సొమ్ముల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి పనుల్లో మత్తర్ల మాయా జాలం జరుగుతున్నా సూపర్‌వైజర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డ్వామా డీవీవో రత్నకుమారి, ఏపీడీ వరప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గన్ని కృష్ణను కలిసిన మంత్రి రామానాయుడు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవానికి శనివారం రాజమహేంద్రవరం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కంబాల చెరువు సెంటర్‌లోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు రాజకీయ విషయాలను ప్రస్తావించినట్టు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత ఏర్పడిందని భావిస్తున్నారు.

ఉపాధ్యాయుల ర్యాలీ

తాళ్లపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో అక్టోబరు 7న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. ఈ మేరకు మండలంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ధర్నాలో జిల్లా నుంచి సుమారు 1000 మంది ఉపాధ్యాయులు పాల్గొనే విధంగా ఫ్యాప్టో కార్యాచరణ రూపొందించినట్టు పేర్కొన్నారు.

జీఎస్టీ 2.0 ఫలాలను పొందుకోవాలి

ఆజాద్ చౌక్‌లో ఎమ్మెల్యే వాసు కరపత్రాల పంపిణీ



ఆజాద్ చౌక్‌లో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0తో సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని, దీని పట్ల అవగాహన పొంది, దీని ఫలాలను పొందుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు.స్థానిక ఆజాద్‌చౌక్‌లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆయన ప్రజలకు, వ్యాపారులకు అందజేశారు. ఈ విధానం వల్ల ప్రతీ కుటుంబానికి నెలకు రూ.15 వేల వరకూ ఆదా అవుతుందన్నారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఎస్‌హెచ్‌జీ వీవోఏలకు జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో వి.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, పార్మశీ మందులపై జీఎస్టీ తగ్గించారన్న విషయాలను డ్వాక్రా సభ్యులకు చెప్పాలన్నారు. ఎవరైనా జీఎస్టీ అమలు చేయకపోతే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సదస్సులో ఏపీఎం టి.సుప్రియ, సీనియర్ అసిస్టెంట్ మంగరాజు పాల్గొన్నారు.



జీఎస్టీ పోస్టర్స్‌తో మండల ఎస్‌హెచ్‌జీ వీవోఏలు

భూమి ఆక్రమించారని మంత్రి లోకేశ్‌కు ఎన్ఆర్ఐ ఫిర్యాదు



మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న కొఠారు ప్రదీప్ చక్రవర్తి, తల్లి సుచిప్రభ


నల్లజర్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం సింగరాజుపాలెంలో తన భూమిని కొంతమంది రాజకీయ నాయకులు ఆక్రమించుకున్నారని ఎన్ఆర్ఐ కొఠారు ప్రదీప్‌చక్రవర్తి, ఆయన తల్లి సుచిప్రభ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం నల్లజర్ల ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎన్ఆర్ఐ మాట్లాడుతూ తాను 18 ఏళ్లపాటు యూకేలో ఉండి తన తండ్రి మరణించడంతో తల్లిని చూసుకునేందుకు వెనక్కి వచ్చానని చెప్పారు. ఈలోపు తమ గ్రామానికే చెందిన రాజకీయ నాయకులు కొందరు రూ.3 కోట్లు విలువ చేసే తనకు చెందిన రెండున్నర ఎకరాలతోపాటు ప్రభుత్వభూమి, పుంతలు, రహదారులు కలిపి మొత్తంగా ఆరున్నర ఎకరాల భూమి ఆక్రమించుకొని కౌలుకు ఇచ్చారన్నారు. దీనిపై ఎన్నోసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అయినా తనకు న్యాయం జరగలేదన్నారు. తన వద్ద అన్ని రకాల ఆధారాలున్నాయని, ఈ విషయంలో ఇప్పటికైనా న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఇటీవల సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తూ తన స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణ సామగ్రి వేశారని, తొలగించమని అడిగితే తనపై, తన తల్లిపై దొంగతనం కేసు పెట్టి ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని మంత్రి లోకేశ్‌ను కలిసి తమకు న్యాయం చేకూర్చాలని విన్నవించినట్టు ప్రదీప్‌చక్రవర్తి తెలియజేశారు.

రేపటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

రాజహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు



రాజహేంద్రవరం కల్చరల్ అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తపాలా డివిజన్ పరిధిలో ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జాతీయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా 6న సాంకేతిక దినోత్సవం, 7న సామాన్య ప్రజలను ఆర్థిక చేరికలో భాగంగా చేయడానికి పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు సేవలపై అవగాహన కల్పించి కొత్త ఖాతాలు ప్రారంభిస్తామన్నారు. 8 నుంచి 14వ తేదీ వరకు ఆధార్ నమోదు, మార్పులకు రాజమండ్రి పోస్టల్ డివిజన్ పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగంచేసుకోవాలని శేషారావు కోరారు.



నే ఆటోవాన్ని.. ఆటోవాన్ని..!



నే ఆటోవాన్ని.. ఆటోవాన్ని అన్నగారి రూటువాన్ని.. అంటూ నాయకులు శనివారం ఆటోవాలాలుగా మారిపోయారు.. ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం పథకం ప్రారంభోత్సవంలో భాగంగా డ్రైవర్లుగా కనిపించారు..మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఖాకీ చొక్కా ధరించి ఆయా నియోజకవర్గాల్లో ఆర్థిక సాయం అందించారు.







'ఆటో' జోష్!



- ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం
- ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 వేలు
- 11,915 మందికి రూ.17.87 కోట్లు జమ
- కంబాలచెరువు నుంచి ఆటోనడిపిన మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్ప ఆలోచనతో ఆటో, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడం చారిత్రాత్మక నిర్ణయమని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కంబాలచెరువు పార్కు వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అక్కడి నుంచి స్వయంగా ఆటో నడుపుతూ ఆనం కళాకేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మేనిఫెస్టోలో లేకపోయినా సాయం అందించామన్నారు. గత ప్రభుత్వంలో అనేక ఆంక్షలు పెట్టి 2.61 లక్షల మందికి మాత్రమే రూ.10 వేలు చొప్పున రూ.260 కోట్లు ఖర్చు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు ఒక చేత్తో రూ.10 వేలు ఇస్తూ మరో చేత్తో పన్నులు పేరిట ముక్కుపిండి వసూలు చేసిన పరిస్థితి ఉందన్నారు. రోడ్లన్నీ గుంతలమయం కారణంగా ఆటోల మరమ్మతులకే ఏడాదికి రూ.20 వేల వరకూ ఖర్చయ్యేదన్నారు. ఆటోలపై వివిధ రూపాల్లో జరిమానా వేయడం, గ్రీన్‌టాక్స్ రూ.20 వేలకు పెంచి ఆటోడ్రైవర్లపై గుదిబండ వేశారన్నారు. మద్యం బలహీనతలను ఆసరాగా చేసుకుని నాసిరకమైన మద్యాన్ని అధిక ధరలకు విక్రయించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటోలపై ఎక్కడా ఫైన్లు వేయడంలేదని, గ్రీన్స్ ట్యాక్స్ రూ.3 వేలకు తగ్గించామన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కూడా అభివృద్ధి అని భావించి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11,915 మంది డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.17.87 కోట్లు సాయం అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు అమరావతిలో పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం చెక్కును మంత్రి ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ,కూటమి నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, యర్రా వేణుగోపాలరాయుడు తదితరులు

బాణసంచా కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్పీ నరసింహ కిశోర్ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తయారీ, నిల్వ, అమ్మకాల కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దేశిత దూరంలో ఉండాలన్నారు. ఒకవేళ అగ్నిప్రమాదం సంభవిస్తే స్పందించాల్సిన తీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు, ఇసుక, నీళ్ల వంటివి అందుబాటులో ఉండాలన్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదన్నారు. ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

నిద్రమత్తు.. డాబా పైనుంచి పడి యువకుడి మృతి

కొవ్వూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : డాబా పైనుంచి ప్రమాదవశాత్తూ పడి యువకుడు మృతి చెందాడని కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన రాజులపాటి నాగబాబు(32) సోదరుడు ఇటీవల మరణించాడు. దీంతో ఆ ఇల్లు ఖాళీ చేసి వేరేచోట నివాసం ఉంటున్నారు. నాగబాబుకు అన్నయ్య అంటే చాలా ఇష్టం. దీంతో అన్నయ్య గుర్తుకు వచ్చినప్పుడు వచ్చి ఇంటి డాబాపైన నిద్రిస్తుంటాడు. అదే విధంగా ఈ నెల 3న డాబాపై నిద్రిస్తూ మధ్యలో లేచి కిందికి వస్తుండగా నిద్రమత్తులో కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.



పిల్లలు ఒక్కసారి దగ్గినా, కొద్దిగా ముక్కు కారినా వెంటనే మందు వేసేయాల్సిందే. నెలా, రెండు నెలల వయసైనా ఇదే పద్ధతి. ఇది చాలా ప్రమాదమని వైద్యులు చెప్పినా వినిపించుకోని వాళ్లు చాలామంది ఉన్నారు. పసివాళ్లకు కాస్త నలత చేసిందంటే ఇంట్లో కలత మొదలవుతుంది. వాళ్లు నోరు తెరిచి చెప్పలేరు. పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్లు ఎలా వస్తాయో అలానే తగ్గిపోతాయని వైద్య నిపుణులు చెప్పే సత్యం. కానీ శరీరం సర్దుబాటు చేసుకునే సమయం ఇవ్వడమే ఇక్కడ కీలకాంశం. వాస్తవానికి కాఫ్ సిరప్‌లు పనిచేయడానికే నాలుగు రోజుల సమయం పడుతుందట. వాటికంటే ఆవిరి పడితే చాలావరకూ వేగంగా కోలుకుంటారని పిల్లల వైద్యులు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని చిన్నారుల మరణం ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తోంది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడొద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- (రాజమహేంద్రవరం/గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)



చిన్నారులకు.. మందులు..వద్దు!

నలత చేసినా.. కలత పడొద్దు..

వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా రోగాలు వస్తుండడం సర్వసాధారణం. ఐదేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. వైరల్ ఇన్ఫెక్షన్లు కావడంతో మందులతో పెద్దగా ఫలితం ఉండదు. కానీ కొందరు డాక్టర్లు ఏవేవో కాంబినేషన్లతో కూడిన మందులు రాసేస్తారు. చాలామంది మందుల షాపు నుంచి కొనుక్కొని వాడేస్తుంటారు. ఇటీవలకాలంలో చిన్నారుల్లో మందుల వినియోగం గణనీయంగా పెరిగింది. మూడేళ్ల కిందటితో పోల్చుకుంటే చిన్నారుల మందుల విక్రయాలు దాదాపు 75 శాతం పెరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇది ప్రమాదకర స్థితిని సూచిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవల పెద్దలు తాగే దగ్గు సిరప్‌ను చిన్నారులకు పట్టగా 11 మంది చనిపోయారు. జైపూర్‌కు చెందిన కేసన్స్ అనే సంస్థ తయారుచేసిన సిరప్ వల్ల ఈ మరణాలు సంభవించినట్టు గుర్తించారు. ఈ సిరప్‌లు నాణ్యతా లోపంతో ఉండడంతోపాటు చిన్నారులకు, పెద్దలకు ఒకే విధమైన సిరప్‌లను మార్కెట్‌లో ఉంచడంతో ప్రాణాపాయం ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు వైద్య- ఆరోగ్య శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అప్రమత్తమయ్యాయి.

దగ్గు వస్తే ఇలా చేసి చూడండి..

రెండేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో జలుబు, దగ్గు వచ్చినా మందులు ఇవ్వడం కానీ, సూచించడం కానీ చేయవద్దని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఎలాంటి మందులు వాడకుండానే దగ్గు తగ్గిపోయే అవకాశాలే అధికంగా ఉంటాయని కేంద్రం తెలిపింది. పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం వంటివి సోకితే తగిన విశ్రాంతి ఇవ్వాలి. శరీరంలో సహజంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి ఇన్ఫెక్షన్‌పై దండెత్తి తరిమి కొట్టే సమయం ఇవ్వాలి. గోరు వెచ్చని ద్రవాలను వైద్యుడి సలహాతో పట్టించవచ్చు. 12 నెలల కంటే ఎక్కువ వయసు పిల్లలకు నిద్ర సమయానికి ఓ అర గంట ముందు కొద్దిగా తేనె కలిపిన గోరువెచ్చని నీళ్లు పట్టించడం వల్ల దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. మూడు రోజులు చూసిన తరువాత చిన్నారుల్లో వచ్చే దగ్గు, రొంప తదితర వ్యాధులకు వైద్యులను సంప్రదించాలి. వెంటనే అవసరం ఉండదు.

- మితిమీరిన మందులు హానికరమే
- దగ్గు, జలుబు సిరప్‌ల వల్ల నష్టాలు ఎక్కువే
- రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి
- పిల్లలకు మందులు వద్దని కేంద్రం ఆదేశం
- పెద్దల మందులు వాడేసినా ప్రమాదమే



ఇలా వాడొద్దు..

చిన్నారుల్లో జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, వాంతులు ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి నెలా చిన్నారులను వైద్యులు వద్దకు తీసుకెళితే వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మందులు మార్పు చేస్తారు. అలా చేయకుండా ఒకే రకమైన మందులను రెండు, మూడేళ్ల వరకు వినియోగిస్తున్నారు. డ్రాప్స్ స్థానంలో పీడియాట్రిక్ సిరప్‌లు, అవి అందుబాటులో లేకుంటే పెద్దల సిరప్‌లు వినియోగించే వారు అధికం.లేకుంటే మెడికల్ షాపులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి వారు సూచించిన మందులను వాడేస్తున్నారు. ఇప్పుడు ఇదే ప్రమాదకరంగా మారింది. దగ్గు, రొంప, జ్వరం వచ్చినప్పుడు ఆరేళ్లలోపు చిన్నారులకు పెద్దల మందులను డోస్ తగ్గించి వాడితే సరిపోతుందనే భావన సరికాదు. చిన్నారులు, పెద్దలు ఎవరైనా సరే వైద్యులు సూచించిన మోతాదులోనే మందులను వినియోగించాలి.

ఈ మందులు వాడితే ప్రమాదమే..!

జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు డీకంజెస్టెంట్లు, యాంటీ హిస్టామైన్, డెక్స్‌ట్రామెథార్ఫన్ కాంబినేషన్ల మందులను డాక్టర్లు సిఫారసు చేస్తుంటారు. వాటివల్ల దారుణమైన ప్రతికూలతలు ఉన్నాయి. అవి నేరుగా మెదడుపై ప్రభావం చూపడంతో పిల్లలు మూర్చకు గురవుతారు. మగతగా ఉంటారు. గుండె కొట్టుకొనే వేగం పెరిగి మరణానికి దారి తీస్తుంది. మల విసర్జితానికి ఇబ్బంది కలుగుతుంది. పిల్లలు చిరాకు, ఆందోళనగా ఉండి నీరసించి పోతారు. డెక్స్‌ట్రామెథార్ఫన్, గ్వాఫెనిసిన్ వల్ల ఎక్కువగా అలా జరుగుతుంది. కానీ మనం రోగం పెరుగుతున్నా తగ్గుతోందని అనుకొని ఆ మందులనే బలవంతంగా పట్టించేస్తాం.

సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం..



చిన్నారులతోపాటు పెద్దల్లో సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం. ఒకసారి డాక్టరు సూచించిన మందులను నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత తరచూ వాడడం వల్ల దుష్ప్రభావం చూపే అవకాశాలు అధికం. వైద్యులు ఏదైనా మందును సూచించినప్పుడు మోతాదు ప్రకారం వాడాలి. చిన్నారుల సిరప్‌లు, డ్రాప్స్‌ను తెరిచిన తర్వాత 21 రోజుల్లోగా వాడాలి. ఆ తర్వాత వాడితే ఇబ్బందికరమే. వైద్యుల సలహా లేకుండా మందులు వాడడం వల్ల చిన్నారుల్లో మెటబాలిజం దెబ్బతినే ప్రమాదముంది. చిన్నారులకు ఏ ఇబ్బంది ఉన్నా వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విజయశేఖర్, చంటి పిల్లల వైద్య నిపుణుడు, ప్రభుత్వాసుపత్రి కాకినాడ

మూడు రోజులు చూడాలి



దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లు వస్తే తక్షణమే మందులు అవసరం లేదు. కాచి చల్లార్చి గోరు వెచ్చగా తేనె నీళ్లు (ఏడాది దాటాక), తేనె లవంగం నీళ్లు, ఆవిరి పట్టడం వంటివి చేయవచ్చు. మూడ్రోజుల తర్వాత కూడా దగ్గు వస్తుంటే డాక్టరును సంప్రదించాలి. అవసరం అనుకుంటే వారి పర్యవేక్షణలోనే తగు మోతాదులో మందులు వాడాలి. డెక్స్‌ట్రామెథార్ఫన్ నాలుగేళ్లలోపు పిల్లలకు వాడకూడదు. మందుల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం.

- కొండా ఉమా శివరామకృష్ణ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, రాజమండ్రి

తోటలను పీల్చి పిప్పి చేస్తున్నాయ్!

- పంటలపై ఆఫ్రికా నత్తల దాడి
- పల్లెలకు పాకుతున్న వైనం
- నాశనమైపోతున్న తోటలు
- నష్టపోతున్న రైతాంగం
- పనిచేయని పురుగుమందులు
- కన్నెత్తి చూడని అధికారులు
- రైతులకు కొత్త తలనొప్పి

నల్లజర్ల/ కోరుకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆఫ్రికా నత్తలు నరకం చూపిస్తున్నాయి.. రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి..ఎక్కడ నుంచి ఎలా వచ్చాయో తెలియదు కానీ రైతులను పట్టిపీడిస్తున్నాయి.. ఎక్కడికక్కడ నత్తలు విజృంభించి పంటలు,తోటలను పీల్చి పిప్పి చేస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా రైతులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నల్లజర్ల మండలం ఆవపాడు, శింగరాజుపాలెం, ముసుళ్ళకుంట, పుల్లలపాడు, కోరుకొండ మండలం దోసకాయలపల్లి తదితర గ్రామాల్లో నత్తల విజృంభణ అధికంగా ఉంది. నిమ్మ,ఆయిల్ పాం, కొబ్బరి, కోకో, కూరగాయల పంటలకు నత్తలు వందల సంఖ్యలో పట్టి రసం పీల్చేస్తున్నాయి. ఎన్ని పురుగుమందులు పిచికారీ చేసిన ఫలితం లేకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వ్యవసాయాధికారులు,ఉద్యాన అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. కూలీల సహాయంతో తొలగిస్తున్నా మరుసటి రోజు మళ్లీ అదే సంఖ్యలో నత్తలు చేరి సర్వనాశనం చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.



నిమ్మచెట్టును ఆశించిన ఆఫ్రికా నత్తలు

నత్తల దెబ్బకు నిమ్మ, జామ తదితర చెట్లు ఎండిపోతున్నాయి. చివరి దశకు వచ్చిన చేలు కళ్లెదుటే పీల్చిపిప్పిచేస్తుంటే తట్టుకోలేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నత్తల నివారణ ఇలా..

- ఈ నత్తలు మామూలుగా తోటలో కనిపించేవి కాదు.. ఆఫ్రికా దేశం నుంచి వలస వచ్చిన జాతి. ప్రస్తుతం పంటలను పట్టి పీడిస్తోంది. రైతాంగం దృష్టి పెడితే నివారించవచ్చు.
- ఒక్కొక నత్త 1000 నుంచి 1200 గుడ్లు పెడుతుంది రైతులు సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి.
- తోటలో కనిపించిన నత్తలను చేతులకు గ్లౌజులు వంటివి తొడుక్కుని ఒక్కొకటిగా ఏరి ఒక కేజీ ఉప్పు లీటరు నీటిలో కలుపుకున్న ద్రావణంలో నత్తలను వేస్తే నివారించొచ్చు. మళ్లీ అవి వచ్చే అవకాశం ఉండదు. ఈ చిన్న చిట్కా పాటించాలి.
- ఉధృతి ఎక్కువ ఉంటే 1లీ నీటికి 3గ్రాముల చిలెటెడ్ కాపర్, 3 గ్రాముల చిలెటెడ్ ఐరన్ కలిపి చెట్ల మీద పిచికారి చేసుకుంటే రాలి చనిపోతాయి.
- ఒకతోట నుండి వేరొక తోటకి వ్యాప్తి చెందకుండా సరిహద్దులో అక్కడక్కడా ఉప్పునీరు చల్లిన గోనె పట్టలను పరిచినా వాటి వ్యాప్తి నివారించవచ్చు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటకు నాశనం తప్పదు. తెలియకుండానే పంటంతా నాశనమైపోతోంది.
- నత్తల నివారణకు ఏ పురుగు మందు పిచికారి చేయకూడదు. చేసినా ఫలితం ఉండదు.



ఏ దేశమేగినా..ఎందుకాలిడినా!

ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలి.. ఈ విషయం తెలియాలంటే గోదావరి జిల్లాలకు రావాల్సిందే మరి.. అది తెలుసుకున్నారు.. ఇదిగో ఇలా తరలివచ్చారు.. ఎక్కడి నుంచో తెలుసా.. బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక నుంచి సుమారు 30 మంది ప్రతినిధులు బృందం వచ్చారు.. శనివారం పెరవలి మండలం ముక్కామల, కొవ్వూరు మండలం కాపవరంలో ప్రకృతి సాగు చేస్తున్న రైతులను పలకరించారు. సాగు విధానం తెలుసుకున్నారు.. రైతులను ప్రశంసించారు.

8

మానవత్వం చాటిన ఎమ్మెల్యే ముప్పిడి

నల్లజర్లలో 8న జాబ్‌మేళా

8

జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు

తాళ్లపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీ 2.0 పై అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ స్థానిక వర్తక సంఘ సభ్యులతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జీఎస్టీ 2.0 సామాన్య ప్రజానీకానికి చేరవేయాలనే విషయంపై అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. తాళ్లపూడి వర్తక సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి



ఆటోడ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , ఇతర అధికారులు

కొవ్వూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఆటోరిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఆటోడ్రైవర్ల సేవలో భాగంగా మంజూరైన నమూనా చెక్కును అందించారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఖాకీ చొక్కా ధరించి ఆటో నడిపారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులు విజయవిహార్ సెంటర్, ఆర్డీవో కార్యాలయం, రైల్వేస్టేషన్ మీదుగా ఆటోలపై ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో 1336 మందికి మంజూరైన రూ. రెండు కోట్ల 40 లక్షల చెక్కును ఆటోడ్రైవర్లకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు రూ. 10 వేలు అందించి తనిఖీలు పేరుతో వేలకు వేలు దోచుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ. 15 వేలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఆర్డీవో రాణీసుస్మిత, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అల్లూరి విక్రమాదిత్య, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మీప్రసన్న, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పట్టణ సీఐ పి.విశ్వం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఉప్పులూరి బాబ్జీ, సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, గారపాటి రామకృష్ణ, చావా శ్రీనివాసరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, బోడపాటి ముత్యాలరావు, గొరిజాల సురేష్, సుంకర సత్తిబాబు, గంటా కృష్ణ, విజయ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 1237 మంది ఆటోడ్రైవర్లకు రానున్న మూడునెలల జీతంతో ప్రమాద బీమా పాలసీ చేయిస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హామీ ఇచ్చారు. గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఆటోడ్రైవర్ల సేవలో పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 1000 ఆటోలతో ఏఎంసీ నుంచి ర్యాలీగా బయల్దేరి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణానికి చేరుకునే భారీ బహిరంగ సభలో మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు భూరెడ్డి శ్రీనివాస్ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు ఆధ్వర్యంలో బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలను కంటికిరెప్పల కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి భాగ్యవతి, ఎంపీడీవో ఆర్.సుజాత, జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, మాజీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, సమన్వయ కమిటీ సభ్యులు హోతా రాజాబాబు, వేముల నాగరాజు, సీనియర్ నాయకులు విష్ణురాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాఘవ, ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, ముత్యాల రాయుడు, సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేశ్, జ్యేష్ఠ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కొడవటి చినవెంకటేశ్వరరావు, ఆసుపత్రి కమిటీ సభ్యులు పడమట శ్రీనివాస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నిడదవోలు: ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసమే ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రతి ఏడాది 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం ఆటోడ్రైవర్ల సేవలో చెక్కును అందించారు. కార్యక్రమంలో రవాణాశాఖాధికారులు, మండల స్థాయి అధికారులు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు. పథకం ప్రారంభోత్సవంలో కూటమి నేతల మధ్య ఉన్న విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. మంత్రి కందుల దుర్గేష్ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కావడంతో అక్కడ జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో పాల్గొన్నారు. అయితే నిడద వోలులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మొదలుకొని పట్టణ, మండల నాయకుల నుంచి కార్యకర్తల వరకు ప్రారంభోత్సవానికి దూరంగా ఉండడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై ఎంపీడీవో జగన్నాథరావుతో మాట్లాడగా మండల స్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలను ఆహ్వానించామని తెలిపారు. దీనిపై వివరణ కోరేందుకు కమిషనర్ తోట కృష్ణవేణికి ఫోన్ చేయగా ఆన్సర్ చేయకపోవడం విశేషం. పార్టీల నాయకుల మధ్య విభేధాలకు పలువురు అధికారులే కారణమవుతున్నారని పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు.

బాడీ ఫ్రీజర్లను వినియోగించుకోండి

● శ్రీ శివసాయి ధామం సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారాం



శ్మశానవాటికలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న శివసాయిధామం సేవా సమితి సభ్యులు

కొవ్వూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం స్థానిక హిందూ శ్మశానవాటికలోని వైకుంఠధామంలో శవాలను భద్రపరిచే ఫ్రీజర్లను ఏర్పాటు చేసినట్టు శ్రీ శివసాయి ధామం సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారాం తెలిపారు. రూ. 33 లక్షలతో నూతనంగా కాటికాపరుల కోసం నిర్మించిన నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. అలాగే పార్థివ దేహాలను భద్రపరచడానికి రెండు ఫ్రీజర్లు, రూ. 8 లక్షలతో ఇళ్లకు ఇచ్చే ఫ్రీజర్ బాక్సులు 3, రూ. రెండు లక్షలతో అస్తికలు భద్రపరచడానికి 100 లాకర్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కసిరెడ్డి సీతారాం, కార్యదర్శి తాతయ్యబాబు మాట్లాడుతూ ఇంటి వద్ద పార్థివదేహాలను పెట్టుకోవడానికి ఇబ్బందికరంగా ఉన్నవారి కోసం వైకుంఠధామంలో రెండు ఫ్రీజర్లను ఏర్పాటుచేశామన్నారు. వీటిని కరెంటుచార్జీలు చెల్లించి ఉచితంగా వినియోగించుకోవచ్చునన్నారు. ఇంటి వద్దకు ఇచ్చే ఫ్రీజర్లు ఉచితమేనని, రానుపోను ట్రాన్స్‌పోర్టు చార్జీలు చెల్లించి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పరిమి రాజేష్, నగళ్లపాటి శ్రీనివాసరావు, నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు, సీహెచ్ గణేష్, నాగేశ్వరరావు, రామకృష్ణ, శంకర్, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో కెనరా బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జనరల్ మేనేజర్ (విజయవాడ) విజయలక్ష్మి సిజే

చాగల్లు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చాగల్లులో కెనరా బ్యాంకు నూతన శాఖను ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ విజయలక్ష్మి సీజే (విజయవాడ) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు సహా అన్నివర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకు పనిచేస్తోందన్నారు. అనంతరం డిప్యూటీ జనరల్ మేనేజర్ (భీమవరం) ఎం. మాధవరావు , బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ తోట, టీడీపీ నేత కొఠారు అశోక్‌బాబా మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేత కరుటూరి సతీష్, వర్తకసంఘం ప్రముఖులు గ్రంధి రాంబాబు, పెంజర్ల గణేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గ్రండోతు సూర్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ ముళ్లపూడి ఉదయభాస్కర్, లయన్స్ ప్రముఖులు పీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సత్కారం



సత్యసుబ్బారావు దంపతులను సత్కరించిన దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ టీచర్ ఆకుండి వెంకట సత్యసుబ్బారావు పదవీ విరమణ సభ శనివారం మోర్త హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా మంచి సేవలు అందించినట్టు చెప్పారు. ఈయన ఆధ్వర్యంలో విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులు పాఠశాలకు రావడం అభినందనీయమని చెప్పారు. అనంతరం వెంకట సత్యసుబ్బారావు దంపతులను టీచర్లు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఎంఈవోలు సక్సేనరాజు, శారదాజ్యోత్స్న, టీచర్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి

దేవరపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పాత డీఏ బకాయి, పీఆర్‌సీ బకాయిని వెంటనే చెల్లించాలని దేవరపల్లి మండల ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎల్‌వీవీ రామారావు, ఓరుగంటి శివ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక చైతన్య స్కూల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కులపాకుల గంగరాజు, కే.బాబు, కే. మోహన్, పాపోలు రామారావు, కిరణ్‌కుమార్, కే.భూషణం, శ్రీనివాస్ రెడ్డి, సతీశ్, కే.శ్రీనివాస్, సుధా కర్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



ఉండ్రాజవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహా కార్యక్రమంలో భాగంగా శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు. దీనికి విచ్చేసిన పెరవలి ప్రాజెక్టు సీడీపీవో ఆశారోహిణి మాట్లాడుతూ బాలింతలు, పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వీఆర్వోలు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



అన్నదేవరపేట బీసీ కాలనీలో కొలువుదీరిన అమ్మవారు



చాగల్లులో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కనకదుర్గమ్మవారు

తాళ్లపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట బీసీ కాలనీలో కొలువై ఉన్న కనక దుర్గమ్మ వారి శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి భార్గవ్, పెద్దింటి శ్యామ్ సుందర్ శనివారం అమ్మవారికి విశేషపూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అన్నదేవరపేటలోని రేగులమ్మవారి ఆలయంలో శరన్నవ రాత్రులు ముగింపు సందర్భంగా అమ్మవారికి మేళతాళాలతో వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ముఖ్యంగా చాగల్లు దావనయ్యపేటలోని వేణుగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిట్టిదుర్గమ్మవారి నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే వల్లుగుటలోని కనక దుర్గమ్మవారి ఉత్సవాలు ముగిం పు సందర్భంగా అమ్మవారి ఊరేగిపు వైభవంగా జరిగింది. భారీఎత్తున బాణసంచా కాలుస్తూ, వేషాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రాహ్మణగూడెంలోనూ కనకదుర్గమ్మవారి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ముప్పిడి

● గాయపడిన వ్యక్తికి సపర్యలు



ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలించి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మానవత్వం చాటుకున్నారు. శనివారం మధ్యాహ్నం కొవ్వూరు వైపు నుంచి తాళ్లపూడి వెళ్తున్న పవన్ కుమారదేవం, చిడిపి మధ్యలో ఏటిగట్టుపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని స్పందించి కారు ఆపి ప్రమాదంలో గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం పోలీసు వాహనంలో కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- పఠాన్ బాజీ, లక్ష్మీపురం, దేవరపల్లి మండలం



ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టడంతో ఆటోడ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతం ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ. 10 వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం మా ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసింది. సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

సీఎం మా కష్టాన్ని గుర్తించారు

- ఆర్.గిరీష్ కన్న, పోతవరం, నల్లజర్ల మండలం



గత ప్రభుత్వంలో ఏడాదికి కేవలం రూ. 10 వేలు ఇచ్చేవారు. అవి ఆటో ఫిట్‌నెస్‌కి సరిపోయేవి కావు. మిగతా రూ. 5 వేలు అప్పు చేయాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు మా కష్టాన్ని గుర్తించి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు.

మరమ్మతులు చేయించుకుంటా

- కోపెల్ల శ్రీను, తీపర్రు, పెరవలి మండలం



రూ.15వేలతో నా ఆటోకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాను. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఉపయోగిస్తాను. ప్రభుత్వం ఈ సాయం చేయకపోతే బయట అప్పు చేసి వాటిని చేయించాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటాం.

భూమి ఆక్రమించారని
మంత్రి లోకేశ్‌కు ఎన్‌ఆర్‌ఐ ఫిర్యాదు



లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ కొఠారు ప్రదీప్ చక్రవర్తి, ఆయన తల్లి సుచిప్రభ

నల్లజర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరాజుపాలెంలో తన భూమిని కొంతమంది రాజకీయ నాయకులు ఆక్రమించుకున్నారని ఎన్‌ఆర్‌ఐ కొఠారు ప్రదీప్‌చక్రవర్తి, ఆయన తల్లి సుచిప్రభ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదుచేశారు. శనివారం నల్లజర్లలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎన్‌ఆర్‌ఐ మాట్లాడుతూ తాను 18 ఏళ్లపాటు యూకేలో ఉండి తన తండ్రి మరణించడంతో తల్లిని చూసుకునేందుకు వెనక్కి వచ్చానని చెప్పారు. ఈలోపు తమ గ్రామానికే చెందిన రాజకీయ నాయకులు కొందరు రూ.3 కోట్లు విలువ చేసే తనకు చెందిన రెండున్నర ఎకరాలతోపాటు ప్రభుత్వభూమి, పుంతలు, రహదారులు కలిపి మొత్తంగా ఆరున్నర ఎకరాల భూమి ఆక్రమించుకొని కౌలుకు ఇచ్చారన్నారు. దీనిపై ఎన్నోసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అయినా న్యాయం జరగలేదన్నారు. తన వద్ద అన్నిరకాల ఆధారాలున్నాయని, ఈ విషయంలో ఇప్పటికైనా న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఇటీవల సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తూ తన స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణ సామగ్రి వేశారని, తొలగించమని అడిగితే తనపై, తన తల్లిపై దొంగతనం కేసు పెట్టి ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని లోకేశ్‌ను కలిసి తమకు న్యాయం చేకూర్చాలని విన్నవించినట్టు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

● కాపవరం, ముక్కామలలో బ్రెజిల్ ప్రతినిధుల బృందం పర్యటన



కాపవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధులు

కొవ్వూరు/పెరవలి, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): కాపవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధ తులను బ్రెజిల్, యుఏఈ, శ్రీలంకకు చెందిన 30 మంది నిపుణుల బృందం సందర్శించారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యాపారవేత్త, నౌసంస్థ సీఈవో వాల్టర్ లింక్, బ్రెజిల్ మంత్రిత్వశాఖకు చెందిన వివియన్, సాండ్రో, 30 మంది ప్రతినిధుల బృందం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు విచ్చేసిన విదేశీ ప్రతినిధుల బృందాన్ని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక బృందం పెరవలి మండలం ముక్కామల, రెండో బృందం కొవ్వూరు మండలం కాపవరం గ్రామాల్లో పర్యటించి రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) వినూత్న నమూనాలను పరిశీలించారు. ముక్కామలలో అన్నపూర్ణా నాన్ పెస్టిసైడల్ మేనేజ్‌మెంటు షాపు వద్ద ప్రకృతి వ్యవసాయ 9సార్వత్రిక సూత్రాల చక్రాన్ని సందర్శించారు. అనంతరం ఘనజీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానం, వినియోగం, నిల్వ చేయడంపై అవగాహన కల్పించారు. జి.వెంకటేశ్వర్లు నిర్వహిస్తున్న డ్రమ్ సీడర్‌తో వరి సాగును వీక్షించారు. కలుపునియంత్రణ, కూలీలఖర్చు తగ్గింపు, సమయపాలన వంటి ప్రయోజనాలను అడిగితెలుసుకున్నారు. పి.రామకృష్ణ నిర్వహిస్తున్న పామ్‌ఆయిల్, వక్క, అరటిసాగు నమూనాలను పరిశీలించి ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండో బృందం కాపవరంలో ప్రకృతి వ్యవసాయం 9 సార్వత్రిక సూత్రాల చక్రం, వాటి అమలును పరిశీలించారు. 13 ఎకరాల హార్టీకల్చర్ పాలీక్రాపింగ్ క్షేత్రాన్ని సందర్శించారు. వ్యవసాయ సూత్రాలను అనుసరించడం, సౌరశక్తి వినియోగం ద్వారా చీడపీడల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను ప్రయోగించడం, పంట వైవిధ్యంతో సస్యశ్యామలంగా కనిపిస్తున్న పొలం అడవిని తలపిస్తుందని బృందం సభ్యులు ప్రశంసించారు. సైన్స్ అండ్ అకాడమీ థీమాటిక్ లీడ్ సుధాకర్ నేతృత్వంలో ప్రతినిధులు రైతు శాస్త్రవేత్తలతో సమావేశ మయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించడంలో వారి పాత్రను ప్రశంసించారు. ధర్మవరంలో గోపాలకృష్ణ ఎనీ టైం మనీ నమూనా, వీర మణికంట డ్రం సీడర్ వరిసాగును సందర్శించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ర్యాలీ



ర్యాలీలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీడీరావు, ఉపాధ్యాయులు

తాళ్లపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 7వ తారీఖున రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినప్పటికీ డీఏ విషయంలో కానీ, పీఆర్‌సీ విషయంలో కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ధర్నాలో జిల్లా నుంచి సుమారు 1000 మంది ఉపాధ్యాయులు పాల్గొనే విధంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య కార్యచరణ రూపొందించినట్టు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

'అనుమతిలేకుండా టపాసులు నిల్వ చేస్తే కఠిన చర్యలు'

దేవరపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇళ్లు, షాపులు, గోడౌన్లలో టపాసులు నిల్వ చేసినా, అనధికారికంగా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీఎన్ నాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టపాసులు తయారు చేసేవారు కానీ, విక్రయాలు చేసే వారి వివరాలు తెలియజేసిన వారికి రూ. ఐదు వేలు బహుమతిగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

రోడ్డు నిర్మించాలి

దేవరపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్యాజంపూడి, యర్నగూడెం రోడ్డు అధ్వానంగా ఉందని, దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పరిష్కారం కావడం లేదని త్యాజంపూడి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కుసులూరి సతీశ్, మాజీసర్పంచ్ పల్లి వెంకటరత్నారెడ్డి, సీఐటీయూ నాయకులు ఎస్.భగత్ పేర్కొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): నల్లజర్ల హైస్కూల్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆయన నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్హతతో జాబ్‌మేళాను 25 రకాల కంపెనీలు నిర్వహిస్తున్నాయని, నియోజకవర్గంలో చదువుకున్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో సెలెక్ట్ ఆయన అభ్యర్థులకు వెంటనే ఆర్డర్ కాపీ అందించి వచ్చే నెలలోనే ఉద్యోగంలో చేర్చుకోవడం జరుగుతుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ చదివిన విద్యార్థులకు సంబంధించిన ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.